క్లుప్తంగా

నేడు డయల్ యువర్ ఎమ్మెల్యే

చిత్తూరు అర్బన్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం గురువారం డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ ప్రజలు ఉదయం 10 నుంచి 11 గంటల మధ్య 9849907885కు ఫోన్‌చేసి తన దృష్టికి తీసుకురావచ్చన్నారు. ఈ కార్యక్రమానికి చిత్తూరు కార్పొరేషన్ అధికారులు, చిత్తూరు రూరల్, గుడిపాల మండలాల అధికారులు హాజరవుతారని పేర్కొన్నారు.

చిత్తూరులో సర్కిల్ కార్యాలయం

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్‌శాఖ నూతన సర్కిల్(జిల్లా) కార్యాలయం చిత్తూరులో పెట్టడానికి ఆమోదం తెలుపుతూ బుధవారం సీఎండీ సంతోషరావు ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాల విభజన తర్వాత విద్యుత్‌శాఖ పరంగా ఉమ్మడి జిల్లా పరిపాలన తిరుపతి కేంద్రంగా సాగుతోంది. పరిపాలన సౌలభ్యం మేరకు విభజన కావాలని ప్రతిపాదన ఉంది. ఇటీవల ప్రభుత్వం వీటికి ఆమోదం తెలిపింది. శాఖపై ఆర్థిక ఇబ్బందులు రాకుండ ఉండే ఉద్యోగులతో విభజన చేయనున్నట్లు ఆదేశాల్లో పేర్కొన్నారు.

కామ్రేడ్ ఏబీ బర్దన్‌కు నివాళి


బర్దన్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: కామ్రేడ్ ఏబీ బర్దన్ శతజయంతి సందర్భంగా సీపీఐ ఆధ్వర్యంలో నాయకులు ఆయనకు నివాళి అర్పించారు. చిత్తూరులో బుధవారం బర్దన్ చిత్రపటానికి పూలమాల వేసి నాయకులు నివాళులర్పించారు. ఆయన చరిత్రను, చేసిన పోరాటాల గురించి తెలియజేశారు. త్యాగాలను వివరిస్తూ బర్దన్ ఆశయాలను కొనసాగించాలని ప్రతిజ్ఞ చేశారు. కార్మికవర్గాల సమస్యల పరిష్కారంలో ఆయన చేసిన కృషి ఎనలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నాగరాజన్, నాయకులు విజయగౌరీ, రమాదేవి, కుమారి, మునుస్వామి, నాగరాజు, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించండి


వినతిపత్రం స్వీకరిస్తున్న ఈఈ మునిచంద్ర

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని వినియోగదారులు విన్నవించారు. స్థానిక ట్రాన్స్‌కో అర్బన్ డివిజన్ కార్యాలయంలో బుధవారం విద్యుత్ గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. పలు ప్రాంతాల్లో నుంచి బాధితులు సమస్యలను తెలిపారు. మొత్తం 4 సమస్యలు వచ్చాయని ఈఈ మునిచంద్ర తెలిపారు. 3 కొత్త సర్వీసులు విడుదల, ఒకటి సర్వీస్ కేటగిరి మార్పు చేయాలని వినియోగదారులు తెలిపారన్నారు. సంబంధిత ధ్రువపత్రాలను జత చేయాలని సూచించినట్లు వివరించారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు

గుడిపాల: వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు పాటించి అధిక దిగుబడులు పొందాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నాగపద్మిణి అన్నారు. బుధవారం వసంతాపురం, పశుమందలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆధునిక వ్యవసాయం, వ్యవసాయ యాంత్రీకరణ పద్ధతులను రైతులకు వివరించారు. ఆయా గ్రామాల్లో సాగు చేసిన పంటలను పరిశీలించారు. అనంతరం రైతులకు సబ్సిడీపై ఉలవలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి సాయిసుధ, వ్యవసాయాధికారి మాధవి, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి


మాట్లాడుతున్న ప్రిన్సిపల్ వెంకటాచలపతి

చిత్తూరు కలెక్టరేట్: ఇంజినీరింగ్ విద్యార్థులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని సీతమ్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ వెంకటాచలపతి అన్నారు. మురకంబట్టు వద్ద ఉన్న సీతమ్స్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం అటల్ ఎఫ్‌టీపీ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నాయకత్వ లక్షణాలు, వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకోవడంపై అవగాహన పెంచుకోవాలన్నారు. క్రిటికల్ థింకింగ్ రంగంపై పట్టు పెంచుకోవాలని తెలిపారు. ఎటువంటి పరిస్థితులను అయినా సులువుగా ఎదుర్కోవడానికి విద్యార్థులు సిద్ధంగా ఉండాలన్నారు. అనంతరం విజయసూత్రాలు, పలు అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో అన్నా యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ విమలనాథన్, కో-ఆర్డినేటర్ ఉమామహేశ్వరి, అకడమిక్ అడ్వైజర్ నారాయణ, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తం.. క్షీరాభిషేకం!



- వైభవంగా సాగుతున్న వరసిద్ధుని ప్రత్యేక ఉత్సవాలు

కాణిపాకం: ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామికి బుధవారం క్షీర కలశ ఊరేగింపును అట్టహాసం చేపట్టారు. మణికంఠేశ్వర స్వామి వారి ఆలయం నుంచి క్షీర కలశాలను పురవీధుల్లో ఊరేగించారు. మేళతాళాలు, నవదుర్గ వేషాలు, కేరళ వాయిద్యాలు, తప్పెట్ల నడుమ ఊరేగింపు వైభవంగా సాగింది. తర్వాత ఆలయంలోని కల్యాణ వేదికలో శాస్త్రోక్తంగా ప్రత్యేక కలశాభిషేకం చేశారు. ఉభయదారులచే ఉచిత ప్రసాద పంపిణీ చేశారు. కల్పవృక్ష వాహన సేవను పురస్కరించుకుని ఆలయంలో వివిధ రకాల పుష్పాలంకరణలతో ముస్తాబు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మురళీమోహన్, ఈవో గురుప్రసాద్, కాణిపాకం ఎస్ఐ ధరణీధర్, అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.


ధ్వజస్తంభానికి ప్రత్యేక పుష్పాలంకరణ

అద్భుతం.. సాంస్కృతికం!

ప్రత్యేక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలోని ఆస్థాన మండపంలో సాంస్కృతిక కార్యక్రమాలు అద్భుతంగా సాగుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు అద్భుతమైన ప్రదర్శనలు ఇస్తూ, భక్తులను అలరిస్తున్నారు. ప్రధానంగా కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. పౌరాణిక నాటక ప్రదర్శన, గీతాలాపనలు అలరించాయి. అనంతరం వారికి ఆలయ అధికారులు అభినందనలు తెలిపి జ్ఞాపికలను అందజేశారు.


ఉత్సవమూర్తికి క్షీరాభిషేకం చేస్తున్న వేద పండితుడు


క్షీర కలశాలతో ఊరేగింపుగా వస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు


వివిధ వేషధారణల్లో కళాకారులు


నృత్య వాయిద్యంతో కళాకారులు

పీహెచ్‌సీల్లో రోగులకు సమ్మె పోటు



ఐరాల పీహెచ్‌సీలో ఖాళీగా ఉన్న డాక్టర్ కుర్చీ, రోగులు లేక బోసిపోయిన ఓపీ విభాగం

ఐరాల: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యుల నిరవధిక సమ్మెతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం పల్లెల్లో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. గ్రామాల్లో వైద్యమందించే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు ఆందోళనబాట పట్టారు. రోగులు ప్రైవేట్ ఆస్పత్రులు, ఆర్ఎంపీల వద్దకు పరుగులు తీయాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలు పేదల పాలిట శాపంగా మారాయి. పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న వైద్యుల పీజీ, ఇన్‌సర్వీస్ కోటాను కుదిస్తూ ప్రభుత్వం జీఓ 85ను తీసుకువచ్చింది. దీనిపై వైద్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఈ నెల 16 నుంచి విధులు బహిష్కరించి సమ్మెబాట పట్టారు. మండలంలో ప్రస్తుతం విషజ్వరాలు ప్రబలుతున్నాయి. డాక్టర్లు విధులు బహిష్కరించడంతో ఐరాల, కాణిపాకం పీహెచ్‌సీల్లో ఓపీ, అత్యవసర సేవలు అందక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. తప్పని పరిస్థితిలో కొందరు స్టాఫ్‌నర్సులు, ఫార్మసిస్టులతో వైద్యం చేయించుకుంటుండగా, మరికొందరు ఆర్థికంగా భారమైనా ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తారని చెప్పారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వైద్యులు విధుల్లో చేరేలా చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

నగరంలో స్వచ్ఛతా హీ సేవ


చీపురుతో రోడ్డు శుభ్రం చేస్తున్న కమిషనర్

చిత్తూరు అర్బన్: నగరంలో జన సంచారం ఎక్కువగా ఉండే మార్కెట్లను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ పిలుపునిచ్చారు. స్వచ్ఛతాహీ సేవ –2024 కార్యక్రమాల్లో భాగంగా బుధవారం చర్చివీధి, కూరగాయల మార్కెట్, చేపల మార్కెట్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. పారిశుధ్య కార్మికులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, స్థానిక దుకాణదారులతో కలిసి చీపురు పట్టుకుని రోడ్లను ఊడ్చారు. మార్కెట్లో అపరిశుభ్రంగా ఉన్న గోడకు తెల్ల పెయింట్ వేశారు. అనంతరం కూరగాయల మార్కెట్, చేపల మార్కెట్ పరిసరాలను పరిశీలించారు. దుకాణాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మార్కెట్లో వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగిస్తూ శుభ్రంగా ఉంచాలని ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. కాలువల్లో వ్యర్థాలు వేయకుండా చూడాలని, నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్యశాఖ అధికారి డా.అనిల్ కుమార్ నాయక్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు లోకనాథం, నరసింహ, పారిశుధ్య పర్యావరణ కార్యదర్శులు, మేస్త్రీలు పాల్గొన్నారు.

రిటైర్డ్ డీటీ పింఛన్‌లో కోత

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలోని తవణంపల్లి డిప్యూటీ తహసీల్దార్‌గా విరమణ పొందిన లక్ష్మీ వెంకటేశ్వర్లు పింఛన్‌లో కోత విధించారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా ఉత్తర్వులు జారీచేశారు. తవణంపల్లి డీటీగా ఉన్న సమయంలో విధుల్లో అలసత్వం వహించారన్నారు. అప్పటి చిత్తూరు ఆర్డీఓ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటూ పెన్షన్‌లో ఐదు శాతం కోత ఏడాది పాటు విధించాలని కలెక్టర్‌ను ఆదేశించారు.

లాభసాటి పంటలను సాగు చేయండి

తవణంపల్లె: రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంభించి లాభసాటి పంటలను ఎంచుకొని సాగు చేయాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని మైనగుండ్లపల్లె, ముత్తరపల్లె, నల్లిశెట్టిపల్లె గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మధసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం నల్లిశెట్టిపల్లెలో క్షేత్రస్థాయిలో వేరుశనగ, కంది, వరి పంటలను పరిశీలించారు. రైతులకు సాగుపై అవగాహన కల్పించారు. సేంద్రియ ఎరువులు అధికంగా వాడాలని సూచించారు. వ్యవసాయ అధికారులు సూచనలు పాటించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఓ సాగరిక, ఏఓ ప్రవీణ్ పాల్గొన్నారు.


నల్లిశెట్టిపల్లెలో పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

రైతులకు ప్రోత్సాహం

బంగారుపాళెం: రైతులను ప్రోత్సహించేందుకే పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి చిట్టిబాబు అన్నారు. మండలంలోని తుంబకుప్పం, పెరుమాళ్లపల్లె పంచాయతీల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు మేలైన యాజమాన్య పద్ధతులను అనుసరించి వ్యవసాయం సాగు చేపడితే ఆశించిన స్థాయిలో దిగుబడులు వస్తాయని సూచించారు. ప్రకృతి వ్యవసాయంలో వినియోగించే ద్రవ, ఘన జీవామృతం తయారీ విధానాన్ని ప్రదర్శించారు. అనంతరం క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ లీలావతి, ఏఈఓ సాదరయ్య, విజయలక్ష్మి, శేఖర్, రైతు సేవా సిబ్బంది యుగంధర్, హేమంత్, సుమతి పాల్గొన్నారు.


ద్రవ, ఘనజీవామృతం తయారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

విద్యతోపాటు సామాజిక బాధ్యత అవసరం


ఫ్రె షర్స్ డే వేడుకల్లో ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్: ఉన్నత విద్య చదివే విద్యార్థులు విద్యతో పాటు సామాజిక బాధ్యతను పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. అతిథిగా హాజరైన ఎంపీ మాట్లాడుతూ విద్య ప్రతి ఒక్కరి జీవితంలో వెలుగులు నింపుతుందన్నారు. విద్యతో పాటు వ్యక్తిత్వాన్ని, బాధ్యతలను పెంచుకోవాలని చెప్పారు. ప్రిన్సిపల్ డా.జీవనజ్యోతి మాట్లాడుతూ విద్యార్థులు కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా, జీవితానికి అవసరమైన పాఠాలను నేర్చుకోవాలన్నారు. సీపీడీసీ కార్యదర్శి ఎస్.పీ రామకృష్ణ, అలుమిని అసోసియేషన్ సెక్రటరీ చంద్రశేఖర్ ప్రసంగించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి. వ్యాసరచన, వ్యకృత పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ మీరాసాహెబ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

జగనన్నతో విజయానందరెడ్డి


వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో విజయానందరెడ్డి, చంద్రశేఖర్, రాహుల్‌రెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆ పార్టీ చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జి విజయానందరెడ్డి, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్ కలిశారు. తాడేపల్లె కార్యాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు. వీరితో పాటు చిత్తూరు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నవీన్‌యాదవ్, వైఎస్సార్‌సీపీ జిల్లా యువత ప్రధాన కార్యదర్శి కిషోర్‌యాదవ్, నాయకులు గురుమూర్తియాదవ్, రోహిత్‌యాదవ్ ఉన్నారు. పార్టీబలోపేతానికి కృషి చేయాలని జగనన్న సూచించినట్లు వారు వివరించారు.

జాతీయ స్థాయి పోటీలకు ఐరాల విద్యార్థులు


ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం కోమల, పీడీ దేవా

ఐరాల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు జాతీయస్థాయి జూనియర్స్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు బుధవారం ఆ పాఠశాల హెచ్‌ఎం కోమల తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల ఆగస్టు 17 నుంచి 19వ తేదీ వరకు శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడామైదానంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఇంటర్ డిస్ట్రిక్ జూనియర్స్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు రోహిత్, రూప వీరిద్దరూ విశేష ప్రతిభ కనబరచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఈ ఇద్దరు క్రీడాకారులు అక్టోబర్ 6 నుంచి 10వ తేదీ వరకు కర్నూలులో నిర్వహించనున్న జాతీయ స్థాయి జూనియర్స్ క్రీడా పోటీల్లో పాల్గొంటారని వివరించారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడంతో క్రీడాకారులను, పీడీ దేవాను జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు, జనార్దన్ యాదవ్, కార్యదర్శి రమేష్, పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ మహబూబ్‌బాషా, ఉపాధ్యాయులు అభినందించారు.

సూపర్ సిక్స్ అమలులో కూటమి విఫలం


ప్లేట్లతో శబ్దం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయడంలో విఫలమైందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పోటుగారి భాస్కర్ విమర్శించారు. ఈ మేరకు ఆ పార్టీ నాయకులు మంగళవారం కలెక్టరేట్ ఎదుట థాళీ బజావో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆ పార్టీ నాయకులు ప్లేట్లతో శబ్దం చేస్తూ నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వంద రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన ఏ హామీని అమలు చేయకపోవడం మోసపూరితమేనని ఆరోపించారు. ఈ నిరసన కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు దొడ్డారెడ్డి రాంభూపాల్, నగర కమిటీ అధ్యక్షులు టిక్కీ రాయల్, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కొత్త గొల్లపల్లెలో విజృంభించిన అతిసారం

- ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు
- గ్రామంలోనే రోగులకు వైద్యం అందిస్తున్న డాక్టర్లు
- పర్యవేక్షించిన డీఎంహెచ్‌ఓ ప్రభావతి దేవి

తవణంపల్లె: మండలంలోని నల్లిశెట్టిపల్లె పంచాయతీకి చెందిన కొత్త గొల్లపల్లెలో అతిసారం (వాంతులు, విరేచనాలు) విజృంభించింది. రెండు రోజులుగా అతిసారం వ్యాధి బారిన పడిన రోగులు జిల్లా ప్రభుత్వాస్పత్రిలో, చీలాపల్లె సీఎంసీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మండల వైద్యాధికారి ప్రియాంక నేతృత్వంలో డాక్టర్లు మోహన్‌వేలు, కేశవనారాయణ గ్రామంలోనే వైద్య శిబిరం నిర్వహించి అతిసారం వ్యాధిగ్రస్తులకు వైద్యం అందిస్తున్నారు.


గ్రామంలో ఫాగింగ్ చేయిస్తున్న డీపీఓ లక్ష్మి


చిన్నారి ఆరోగ్యంపై ఆరా తీస్తున్న డీఎంహెచ్‌ఓ ప్రభావతి దేవి

గ్రామంలో పారిశుధ్య పనులు

కొత్త గొల్లపల్లెలో అతిసారం ప్రబలడంతో పంచాయతీ అధికారులు స్పందించి పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ పనులను జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మి పర్యవేక్షించి పంచాయతీ అధికారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. తాగునీరు కలుషితం కాకుండా పైపులైన్ల లీకేజీని అరికట్టాలని ఆదేశించారు. మురుగు నీటి కాలువలను శుభ్రం చేయించాలని, నీటి నిల్వ ఉన్న ప్రదేశాల్లో నీరు లేకుండా చూడాలని సూచించారు. గ్రామం సమీపంలోని అమర్‌రాజా ఫ్యాక్టరీ వ్యర్థాలతో కలుషితమైన నీరు వల్ల పొలాల్లో ఉన్న బోరు బావుల్లో నీరు కలుషితమవుతోందని డీపీఓకు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. దీంతో చాలామంది వ్యాధులు బారిన పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీరు పరీక్షించి రిపోర్టు వచ్చినా వెంటనే తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. డీపీఓ ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి కుమార్ ఆధ్వర్యంలో జేసీబీ యంత్రంతో మురుగు నీటి కాలువలను, చెత్త కుప్పలను శుభ్రం చేయించారు. వీధుల్లో, మురుగునీటి కాలువల్లో బ్లీచింగ్ చల్లించారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయించారు.

తాగునీరు కలుషితం వల్లే అతిసారం

కొత్త గొల్లపల్లెలో తాగునీరు కలుషితం వల్లే పలువురు అతిసారం బారిన పడినట్లు డీఎంహెచ్‌ఓ ప్రభావతిదేవి తెలిపారు. గ్రామంలో అతిసారం వ్యాధిగ్రస్తులకు అత్యవసర చికిత్సల కోసం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సందర్శించారు. అతిసారం వ్యాపించడానికి కారణాలు వైద్యాధికారులను, పంచాయతీ అధికారులను, గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని పరిసరాలను పరిశీలించారు. అతిసారంతో వైద్యం పొందుతున్న రోగులను పరామర్శించారు. అధైర్య పడకండి ఇంటి దగ్గరే మెరుగైన వైదసేవలు అందిస్తామని రోగులకు భరోసానిచ్చారు. తాగునీరు కలుషితం కాకుండా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామంలో అతిసారం కుదుటపడేవరకు వైద్య శిబిరం కొనసాగించి రోగులకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో అంటువ్యాధులు, అతిసారం వంటి వ్యాధులు ప్రబలకుండా గ్రామస్తులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. గ్రామంలో ప్రస్తుతం అతిసారం నిలకడగా ఉందని వివరించారు. గ్రామస్తులు కాచి చలార్చిన నీటిని తాగాలని సూచించారు. డీఎంహెచ్‌ఓతో ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్, పాటు జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి హనుమంతరావు, జిల్లా మలేరియా అధికారి అనిల్‌కుమార్, జిల్లా ఏపిడిమిక్ అధికారి వాణి, మలేరియా సబ్ యూనిట్ అధికారులు పీరుసాహెబ్, మోహనశెట్టి, సర్పంచ్, పంచాయతీ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.